భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 20.0



కలెక్టరేట్‌లో జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

## పూలే జీవితం ఆదర్శం

భీమవరం టౌన్, ఏప్రిల్ 11 : సామాజిక మార్పు కోసం తన జీవిత కాలాన్ని త్యాగం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ కొనియాడారు. ఆయన 198వ జయంతి ఉత్సవాలను గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి కలెక్టర్‌తోపాటు జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.


భీమవరం జామియాఈద్‌గా మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు



## భక్తి శ్రద్ధలతో రంజాన్


భీమవరం టౌన్, ఏప్రిల్ 11 : రంజాన్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. బుధవారం నెల వంక కనిపించడంతో నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేస్తున్న వారు విరమించారు. జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం కొత్త దుస్తులను ధరించి రంగురంగుల టోపీలతో మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడ వున్న పేదలకు ధన సహాయం చేశారు. భీమవరం పెద్ద మజీద్ నుంచి ఎల్ఐసీ కార్యాలయం వెనుక వున్న జామియా ఈద్‌గా మజీద్‌కు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ ప్రాశస్త్యాన్ని వివరించారు. రాజకీయ పార్టీల నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థులు మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేసి, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

# చదువులు ఢమాల్

## సర్కారీ స్కూళ్లపై తల్లిదండ్రుల విముఖత

- విలీనం.. విధానాలలో మార్పులు.. చివరికి పతనం
- రెండేళ్లలో 32,746 మంది ప్రభుత్వ విద్యార్థులు ప్రైవేటు బాట
- టెన్త్ ఉత్తీర్ణతలో వెనుకబాటు.. తల్లిదండ్రులలో నిరుత్సాహం
- నాడు - నేడుతో రంగులు వేశారే తప్ప.. విద్యతో ఆకట్టుకోలేదు


భీమవరం రూరల్, ఏప్రిల్ 11 : వైసీపీ సర్కార్ సంస్కరణల పేరిట ఈ ఐదేళ్లల్లో ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేసింది. విలీనంతో పలు పాఠశాలల మూసివేయడం, సిలబస్‌లో మార్పులు, ఉపాధ్యాయులు ఆకస్మిక బదిలీలు వంటి ఎన్నో కారణాలతో చదువు కుంటుబడింది. ఫలితంగా ఉత్తీర్ణత శాతంపై ప్రభావం పడడంతో చాలా మంది తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు మారుస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన తల్లిదండ్రులు 2021-22 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలను వదులుకునే పనిలో పడ్డారు. ఈ ఏడాది 1,352 ప్రభుత్వ పాఠశాలల్లో లక్షా 38 వేల 863 విద్యార్థులు ఉండగా



2022-23లో ఆ సంఖ్య లక్ష 19 వేలకు పడిపోయింది. అంటే 19,832 మంది ప్రైవేటు స్కూల్స్ బాట పట్టారు. 2023-24 విద్యా సంవత్సరంలో లక్ష 19 వేల 31 మంది విద్యార్థుల సంఖ్య కాస్తా లక్షా ఐదు వేల 31 మందికి చేరింది. ఈసారి 13,914 మంది విద్యార్థులు ప్రైవేటుబాట పట్టారు. ఈ ఏడాదీ అదే ఆలోచన కొనసాగితే జిల్లాలో విద్యార్థుల సంఖ్య లక్షలోపు పడిపోవడం ఖాయం. ఇదంతా వైసీపీ ప్రభుత్వం విద్యా విధానం అమలు వల్లేనని నిపుణులు అంచనా వేశారు.

### టెన్త్ ఉత్తీర్ణత ప్రభావం కారణమే..

ఇంగ్లీషు మీడియం అందుబాటులోకి తెచ్చాం. బ్యాగ్‌లు, పుస్తకాలు, షూలు ఇస్తున్నామంటూ ఊదరగొడుతున్న ప్రభుత్వం వారికి నాణ్యమైన విద్యను అందించడంలో విఫలమైంది. విద్యనందించడంలో సరైన ప్రణాళిక లేకపోవడం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే టెన్త్ విద్యార్థులపై ప్రభావం పండింది. దీంతో 2021-22లో టెన్త్ ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జిల్లాలో 13,616 పరీక్ష రాయగా 5,325 ఉత్తీర్ణత సాధించి 45 శాతంలోపు ఉత్తీర్ణతతో వెనుకబట్టారు. అదే ప్రైవేటు స్కూల్ విద్యార్థులు 7,562 మందికి 6,587 మంది ఉత్తీర్ణత సాధించి 90 శాతం పైగా ఉత్తీర్ణతగా నిలిచారు. 2022-23లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 12,442 మంది పరీక్షలు రాయగా 6,683 మంది అంటే 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. అదే ఏడాది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 7,311 మందికి 6,683 మందితో 90 శాతంపైగా ఉత్తీర్ణత సాధించగలిగారు. ఇలా పరిగణనలోకి తీసుకున్న తల్లిదండ్రులు డబ్బుల భారమైనా సర్కారీ స్కూళ్లు వదిలి వేయడానికి నిర్ణయించుకోవాల్సి వచ్చింది. గ్రామాలలో సక్రమంగా సాగుతున్న ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల్లో విద్యార్థులను విలీనం పేరుతో దూరప్రాంత హైస్కూళ్లల్లో విలీనం చేశారు. జిల్లాలో 116 పాఠశాలలు వరకు విలీనం చేసి వేల మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్ళడానికి ఇబ్బందులు పడేలా చేసింది. వైసీపీ ప్రభుత్వంపై అప్పట్లో తల్లిదండ్రులు నిరసనలు వ్యక్తం చేసినా వెనక్కు తగ్గలేదు.




భీమవరం టీడీపీ జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి ఇంటి ముందు ఎమ్మెల్యే అభిమానుల నిరసన

## రామరాజుకు మళ్లీ పిలుపు

### నేడు అమలాపురంలో చంద్రబాబుతో భేటీ

### కొనసాగుతున్న తమ్ముళ్ల నిరసనలు

భీమవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):ఉండి అసెంబ్లీ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా చివరకు ఎవరు ఉంటారనే విషయమై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. ముందుగా సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజుకు పోటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ తర్వాత అనేక కారణాలతో ఎంపీ రఘురామకృష్ణంరాజుకు కేటాయిస్తారన్న వార్తల వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మంతెన రామరాజు వర్గం చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేకే టిక్కెట్ ఇవ్వాలని ఉండి టీడీపీ కార్యాలయంలో చేపట్టిన ఆమరణ దీక్ష గురువారం రెండో రోజుకు చేరుకుంది. మరోవైపు భీమవరంలోని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి నివాసాన్ని కొందరు ముట్టడించారు. రామరాజుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామంటూ ఆమె హామీ ఇచ్చారు. కోనసీమ జిల్లా పర్యటనలో వున్న చంద్రబాబు నుంచి ఎమ్మెల్యే రామరాజుకు మళ్లీ పిలుపువచ్చింది. ఎమ్మెల్యేతోపాటు, నియోజకవర్గ ముఖ్య నేతలు శుక్రవారం అమలాపురం వచ్చి తనను కలవాలని ఆదేశించారు. ఈ చర్చల తర్వాత ఉండిపై పూర్తి స్పష్టత రానుంది.

## 15న సీఎం జగన్ భీమవరం రాక

భీమవరం రూరల్, ఏప్రిల్ 11 : సీఎం వైఎస్ జగన్ మేము సిద్ధం బస్ యాత్ర ఈ నెల 15న భీమవరం రానున్నట్లు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. '15న జగన్ యాత్ర ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర భీమవరంలో ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి జువ్వలపాలెం రోడ్డు, అంబేడ్కర్ సెంటర్ మీదుగా బైపాస్ రోడ్డుకు ఆనుకుని వున్న బహిరంగ సభ వేదికకు చేరుకుంటుంది' అని ఎమ్మెల్యే చెప్పారు.

## నేడు ఈవీఎం, వీవీ ప్యాడ్‌ల తరలింపు

భీమవరం టౌన్, ఏప్రిల్ 11: రాజకీయ పార్టీల సమక్షంలో నియోజకవర్గాలకు ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్‌ను శుక్రవారం కేటాయిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో ఈ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఈవీఎం, వీవీ ప్యాడ్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందన్నారు. పోలీసు బందోబస్తు మధ్య వాటిని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు తరలిస్తామన్నారు. ఎన్నికల రోజున ఓటు వేయడానికి వచ్చే పౌరులు ఓటరు గుర్తింపు కార్డు తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఓటర్ కార్డు లేకపోయినప్పటికీ ఓటు వేసే వెసులుబాటు ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఈసీఐ ధ్రువీకరించిన 12 రకాల గుర్తింపు కార్డులను అనుమతిస్తున్నట్లు వివరించారు.

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

భీమవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):ఇంటర్ ఫలితాలు శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. జిల్లాలో ప్రథమ సంవత్సరం 17,806 మంది, ద్వితీయ సంవత్సరం 18,143 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. వీరిలో అత్యధికులు ప్రైవేటు కళాశాలల విద్యార్థులే. ఫలితాలు చూసుకోవడానికి విద్యాశాఖ వెబ్‌సైట్‌లను రూపకల్పన చేసింది. ఈసారి కూడా గ్రేడ్‌లను ఇవ్వనున్నారు. విద్యార్థులు 91 నుంచి 100 మార్కులు తెచ్చుకుంటే ఏ1 గ్రేడ్, 81 నుంచి 90 మార్కులకు ఏ2, 71 నుంచి 80 మార్కులకు బీ1, 61 నుంచి 70 మార్కులకు బీ2, 51 నుంచి 60 మార్కులకు సీ1, 41 నుంచి 50 మార్కులకు సీ2 గ్రేడ్‌లుగా పరిగణిస్తారు. ప్రతి సబ్జెక్టులో నిర్దేశిత మార్కులొస్తేనే ఆయా గ్రేడ్‌లు ఇవ్వనున్నారు.

వలంటీర్లూ రాజీనామాలు చేయకండి : టీడీపీ భరోసా -7లో

## అధికార పక్షానికి అనువుగా..

### కొందరు అధికారుల తీరుపై అనుమానాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



- తాడేపల్లిగూడెంలో మున్సిపల్ అధికారి స్థానికతపై, నిధుల దుర్వినియోగంపై ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అయినా ఇప్పటి వరకు చర్యలు లేవు.
- ఆచంట నియోజకవర్గంలో మాఫియా ఇసుక అక్రమ తవ్వకాలపై గ్రామస్థులు నడుం బిగించి ప్రొక్లెయిన్, ట్రాక్టర్లను రెడ్ హ్యాండెడ్‌గా అధికారులకు పట్టించి ఇచ్చినా.. కనీస విచారణ కూడా లేకుండా తర్వాత వాటిని విడిచి పెట్టేశారు.
- సాంస్కృతిక పట్టణ కేంద్రంగా వున్న ఆ నియోజకవర్గంలోని అధికారుల్లో అత్యధికులు ఒకే సామాజిక వర్గం వారు. ఇదే తమకు కలిసి వస్తుందని అధికార పార్టీ నాయకుడు బహిరంగంగా చెబుతున్నారు. ఇక్కడ ఎన్నికల నిబంధనలు మీరుతున్నారంటూ కూటమి అభ్యర్థి ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారుల్లో చలనం లేకపోవడంతో ఆ నేత చెబుతున్న మాట నిజమేననిపిస్తోంది. ఎన్నికలకు ముందే అక్కడి పోలీసు, ఇతర మండల స్థాయి అధికారులు బదిలీ అయ్యారు. అనూహ్యంగా అక్కడ కొత్తగా వచ్చిన వారంతా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం విశేషం.

ఇలా జిల్లాలోని కొందరి అధికారులు అధికార పార్టీతో అంటకాగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఆ పార్టీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికీ దందాలు ఆగకపోవడంతో ప్రతిపక్ష నేతల విమర్శలకు బలం చేకూరుస్తోంది. మరోవైపు ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలంటూ జిల్లా కలెక్టర్ హెచ్చరిస్తున్నారు. తాడేపల్లిగూడెం అధికారి విషయమై గత కలెక్టర్ చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించారు. ఇదే విషయాన్ని అధికార పార్టీ నేతలకు స్పష్టం చేశారు. తీరా కలెక్టర్ బదిలీ అయ్యారు. ఎన్నికల ముందు జిల్లా నుంచి బదిలీ చేయడం వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉందన్న ఆరోపణలు వినిపించాయి. ఎన్నికల కోడ్‌కు ముందే కొత్త కలెక్టర్ జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఎప్పటికప్పుడు ఎన్నికల నియామవళిపై ఆదేశాలిస్తూనే ఉన్నారు. అయినా సరే అధికారులు అధికార పార్టీకి అండదండలు ఇస్తున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. అందుకు తగ్గట్టుగానే ఇటీవల పట్టణాల్లో బిల్లులు పెద్ద మొత్తంలో చెల్లించారు. జిల్లాలోని ఓ మున్సిపాలిటీలో ఏకంగా రూ.6 కోట్లు బిల్లులు మంజూరుచేశారు. కాంట్రాక్టర్‌లకు చెల్లిస్తే అధికార పార్టీ నాయకులకు ఉపయోగకరంగా ఉంటుంది. కమీషన్ రూపంలో నేతలకు కొంత మొత్తం ముట్టచెబుతారు. దీంతో ఎన్నికల ముందు పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించారు. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు వైఎస్ఆర్ ఆసరా సొమ్ములు చెల్లించలేదు. బటన్ నొక్కినా సరే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు చెల్లించారు. ఇలాంటి పరిస్థితుల్లోనే ఆరోపణలకు బలం వస్తోంది.

# నెరవేరని కల..!

## హామీగానే నూజివీడు మామిడి మార్కెట్

- ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పాటుకు హామీ
- ఇబ్బందులు పడుతున్న మామిడి రైతులు



నూజివీడు, ఏప్రిల్ 11 : నూజివీడు కేంద్రంగా మామిడి మార్కెట్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతపై రెండున్నర దశాబ్దాలుగా ఈ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. మాజీ మంత్రి, దివంగత ఎమ్మెల్సీ పాలడుగు వెంకట్రావు కృషితో నూజివీడు కేంద్రంగా మామిడి పరిశోధన కేంద్రం ఏర్పాటైంది. మామిడి మార్కెట్‌ను సైతం నూజివీడులోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. వైఎస్ హయాంలో నూజివీడులో మ్యాంగో హబ్‌ను స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణ విడిపోయాక రాష్ట్రంలో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న హైదరాబాద్ గడ్డి అన్నారం మార్కెట్ ఆ రాష్ట్రానికి వెళ్లిపోయింది. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలోనే నూజివీడు కేంద్రంగా మార్కెట్ ఏర్పాటు చేస్తే పక్కనే ఉన్న గన్నవరం నుంచి అంతర్జాతీయ మార్కెట్‌లైన సౌదీ అరేబియా, అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు నూజివీడు మామిడికాయలు ఎగుమతి చేయవచ్చని వివరిస్తూ మామిడి మార్కెట్ మంజూరు చేయాలని నాటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డిపై పాలడుగు ఒత్తిడి తెచ్చారు. అప్పట్లో ఇక్కడకు వచ్చిన ఆయన నూజివీడు ఏఎంసీ కేంద్రంగా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే అది హామీగానే మిగిలి పోయిందే తప్ప పదేళ్లుగా ఆచరణలోకి రాలేదు.

### జిల్లాల పునర్వ్యవస్థీకరణతో నున్న దూరం

వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణలో కృష్ణా జిల్లాలో అంతర్భాగంగా ఉన్న నూజివీడు నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో విలీనం చేశారు. జిల్లాలో అందుబాటులో ఉందనుకున్న నున్న మార్కెట్ ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి వెళ్లగా ఏలూరు జిల్లాలో సరైన మామిడి మార్కెట్ లేకుండా పోయింది. నూజివీడు పరిసర ప్రాంతాల్లో ప్రైవేట్ మార్కెట్లు ఏర్పాటైనా నూజివీడు నియోజకవర్గంలో అవి కూడా కానరాని పరిస్థితి. ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు నియోజకవర్గం పరిధిలో విస్సన్నపేట, కొండపర్వ, తిరువూరు మండలంలోని లక్ష్మీపురంలోనూ, మైలవరం నియోజకవర్గంలోని చీమలపాడులోనూ ఓ మోస్తారు మామిడి ప్రైవేట్ మార్కెట్లు ఉన్నాయి. ఈ మార్కెట్లను కేంద్రీకృతం చేసి నూజివీడు ఏఎంసీ పరిధిలో మామిడి మార్కెట్ ఏర్పాటు చేస్తే నూజివీడు మామిడికి మెరుగైన మార్కెట్ అవకాశాలు ఏర్పడతాయని రైతులు చెబుతున్నారు. పదేళ్లుగా స్థానికంగా పండుతున్న రసాలు, బంగినపల్లికి జియో ట్యాగింగ్‌ను వచ్చేందుకు కృషి చేయడం, అందులో కొంత ఫలితాన్ని సాధించారు.

### దూరమైన రైల్వే రాక్‌లు

స్థానికంగా ఉత్పత్తి అవుతున్న మామిడిని దాదాపు మూడు దశాబ్దాలుగా జాతీయ స్థాయిలో ఢిల్లీ, కోల్‌కత్తా, ముంబై వంటి ప్రాంతాలకు ఎగుమతులకు రైల్వేశాఖ నూజివీడు రైల్వేస్టేషన్‌లో (కృష్ణా జిల్లా గన్నవరం నియోజక వర్గంలోని హనుమాన్ జంక్షన్‌లో నూజివీడు పేరుతో ఉన్న) రైల్వే రాక్‌లను అందుబాటులో ఉంచారు. రాష్ట్ర విభజన అనంతరం ఈ రైల్వేరాక్‌లు అందుబాటులో లేక మామిడి రైతు ఎగుమతులు చేసేందుకు వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. తిరిగి నూజివీడు రైల్వేస్టేషన్ నుంచి రైల్వేరాక్‌లను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

### ప్రోత్సాహాలతోనే మామిడికి భవిష్యత్

చీడపీడల ఉధృతి, వాతావరణ మార్పుల నేపథ్యంలో దిగుబడులపై ప్రభావం, ధరల్లో సేఠ్‌ల మాయాజాలం వంటి కారణాలతో ఇప్పటికే మామిడి రైతు స్థానికంగా తోటలను తొలగిస్తూ ఇతర వాణిజ్యపంటలైన ఫామాయిల్, మొక్కజొన్న వంటి వాటివైపు మరిలారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ తరాలకు నూజివీడు మామిడిని అందించాలంటే స్థానికంగా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేసి ఇక్కడికే ఇతర ప్రాంతాల సేఠ్‌లను రప్పించడంతో పాటు నూజివీడు రైల్వేస్టేషన్ నుంచి ఎగుమతులకు రైల్వేరాక్‌లను తిరిగి పునరుద్ధరించడంతో పాటు, మామిడి పరిశోధనా కేంద్రాన్ని విస్తృత పరిచి, పరిశోధనలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే చర్యలు చేపట్టాలి. మామిడి ఉప ఉత్పత్తులైన తాండ్ర పరిశ్రమ, పల్ప్ యూనిట్, ముక్కల పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. నాలుగేళ్ల నుంచి 200 ఎకరాల్లో పల్ప్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటిస్తున్నా నేటికీ ఆచరణలోకి రాలేదు. ప్రతిసారి ఎన్నికల సమయంలో మీ సమస్యలు పరిష్కరిస్తాం మాకే ఓటు వేయండి అంటూ నాయకుల హామీలు కేవలం హామీలకే పరి మితం అవుతున్నాయి. ఈ సారైనా అవి ఆచరణకు నోచుకుంటాయని మామిడి రైతులు ఆశాభావంతో ఉన్నారు.

# ఈ ఆసుపత్రిలో ఇంతే..!

### ఏలూరు జీజీహెచ్‌లో రెండు గంటలపాటు అడ్మిట్ కౌంటర్‌లో కనిపించని ఉద్యోగులు..

### రాత్రి వేళల్లో ఇక చెప్పనక్కర్లేదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అత్యవసర విభాగానికి ఎంతో ప్రమాదకరమైన అత్యవసర కేసులు వస్తూ ఉంటాయి. రోడ్డు ప్రమాదాలు, పురుగుల మందు తాగిన వారు, పాము కాట్లు, గర్భిణులు వంటి అత్యవసర కేసులు వస్తూ ఉంటాయి. అక్కడ డ్యూటీ వైద్యులు వెంటనే పరీక్షించి సంబంధిత వార్డులకు అడ్మిట్ అవ్వాలని రాస్తూ ఉంటారు. వార్డులకు వెళ్లాలంటే పేషెంట్ అడ్మిట్ పే షీట్లను రాయించుకోవాలి. ఇది రాయడానికి క్లాస్ ఫోర్ ఉద్యోగిని ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టులుగా ఇక్కడ క్లాస్ ఫోర్ ఉద్యోగులు డ్యూటీలు మారుతూ ఉంటారు. అక్కడ అడ్మిషన్ విభాగం వద్ద కే షీటు రాసిన తర్వాతే వార్డుకు పేషెంటును తీసుకెళ్లితే అత్యవసర వైద్య సేవలు అందిస్తారు. అయితే గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటల వరకు అక్కడ ఒక్క ఉద్యోగి కూడా లేకపోవడంతో పలువురు రోగుల బంధువులు ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదు. ఛాతీ నొప్పికి సంబంధించి వచ్చిన ఒక పేషెంట్‌కు ఆస్పత్రిలో అడ్మిట్ అవ్వాలని సంబంధిత వైద్యులు చెప్పినప్పటికీ కే షీటు రాయకపోవడంతో వార్డులోకి వెళ్లే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో అతనిని ఒక ప్రైవేటు ఆస్పత్రికి బంధువులు తీసుకెళ్లారు. ఇదే విధంగా మూడు కేసులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చింది. చివరకు సాయంత్రం 4 గంటలకు క్లాస్‌ఫోర్ ఉద్యోగిని పంపించారు. అప్పటికే చాలా మంది వెనుదిరిగి వెళ్లిపోయారు. ఉన్న వారిని అడ్మిట్ చేశారు.

ఆస్పత్రిలో కొన్ని విభాగాల్లో కొంత మంది క్లాస్ ఫోర్ ఉద్యోగులు ఖాళీగానే ఉంటున్నారు. ఏ విభాగంలో సిబ్బంది అవసరమో ఏ విభాగంలో అవసరం లేదో సమన్వయ లోపం కారణంగానే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇదే విధమైన పరిస్థితులు కొద్ది రోజుల నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి చేసుకుంటున్నాయని, రాత్రివేళ్లలో ఈ విభాగంలో ఒక ఉద్యోగి కనిపించడని తెల్లవారే వరకు అత్యవసర విభాగంలోనే అడ్మిషన్ల కోసం పడిగాపులు పడుతున్నా రని కొంతమంది సిబ్బందే చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణం అత్యవసర విభాగంలోని అడ్మిషన్ కౌంటర్‌ను ప్రక్షాళన చేసి రోగులకు సత్వర సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.


ఏలూరు ప్రభుత్వాసుపత్రి అత్యవసర విభాగం వద్ద ఖాళీగా వున్న అడ్మిషన్ కౌంటర్



ఆర్టీసీ ఎండీ తిరుమలరావు దంపతులకు, రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ సూర్యకుమారికి చిత్రపటం అందజేస్తున్న ఈవో త్రినాథరావు

## చిన వెంకన్నను దర్శించిన ఆర్టీసీ ఎండీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 11: చిన్నతిరుమలేశుడిని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సిహెచ్ ద్వారకాతిరుమలరావు కుటుంబసమేతంగా సందర్శించారు. ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత ఆలయ ముఖమండపంలో అర్చకులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. ఈవో త్రినాథరావు ఎండీ తిరుమల రావు దంపతులకు శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

### శ్రీవారి సేవలో రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్

మత్స్యశాఖ కమిషనర్ ఏ సూర్యకుమారి గురువారం ఉదయం చినవెంకన్నను దర్శించారు. ముందుగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకుల నుంచి స్వామివారి శేష వస్త్రాన్ని అందుకున్నారు. ఈవో స్వామివారి చిత్రపటం అందజేశారు.



ప్రేక్షకులతో మాట్లాడుతున్న హీరోనవదీప్, హీరోయిన్స్

## అందరికి నచ్చే చిత్రం లవ్‌మౌళి

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 11: నవదీప్ నటించిన లవ్‌మౌళి చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. వేసవి కానుకగా ఈనెల 19 లేదా 26న థియేటర్‌లో సందడి చేయనుంది.ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా గురువారం ఏలూరు ఎస్‌వీసీ మల్టీప్లెక్స్‌లో లవ్‌మౌళి ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. హీరో నవదీప్‌తో పాటు హీరోయిన్లు పంకూరి గిద్వానీ, భావనాసాగి, రచయిత అనంత్‌శ్రీరామ్, ప్రేక్షకులతో కలిసి సందడి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో నవదీప్ మాట్లాడుతూ మనుషులకు దూరంగా బతుకుతున్న ఒక వ్యక్తికి ఒక్కసారిగా ప్రేమ దొరికితే ఎలా ఉంటుందో అనే కోణంలో లవ్‌మౌళి మూవీని తెరకెక్కించినట్లు తెలిపారు. లవ్, ఎంటర్ టైన్‌మెంట్ ఈ చిత్రంలో అందుతుందన్నారు.



ఆసుపత్రి వద్ద ఆందోళన తెలుపుతున్న బాలింత బంధువులు

## ఆసుపత్రి ఎదుట బాలింత బంధువుల ఆందోళన

### వైద్యం వికటించి కాళ్లు చేతులు పడిపోయాయని ఆగ్రహం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 11: తాడేపల్లిగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో డెలివరీకి వెళ్లిన బాలింతకు వైద్యం సరిగా అందించకపోవడం వల్ల కాళ్ల,చేతులు పడిపోయాయని బాలింత బంధువులు గురువారం ఆందోళనకు దిగారు. నల్లజర్ల మండలం ఆవుపాడుకు చెందిన వెజ్జు ప్రియాంకను డెలివరీ కోసం ఆసుపత్రిలో చేర్పారు. అయితే ఆపరేషన్ చేసిన మూడో రోజు ప్రియాంకకు సీరియస్ అవడంతో ఆసుపత్రి వారు రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం అందించినా ప్రియాంకకు ఒక పక్క కాళ్లు, చేతులు పనిచేయక పోవడంతో ప్రియాంక బంధువులు తాడేపల్లిగూడెం ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. ఆసుపత్రిలో మత్తు సరిగా ఇవ్వకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రియాంక తండ్రి అచ్యుత వెంకటస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై డాక్టర్‌ని వివరణ కోరగా ప్రియాంక పరిస్థితి ఇలా అవడానికి ఫిట్స్ రావడమేనని దానికి సంబంధించిన రిపోర్టులు అన్నీ క్లియర్‌గా ఉన్నాయన్నారు.



ముదినేపల్లిలో పోల్‌రాజ్ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ, ఈఈ

## కాల్వలకు నీటి విడుదల పెంచేందుకు కృషి

**» ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సత్యనారాయణ**

ముదినేపల్లి, ఏప్రిల్ 11 : తాగునీటి అవసరాలకు మంచి నీటి చెరువులను నింపేం దుకు కాల్వలకు నీటి విడుదల పెంచే విషయంలో చర్యలు తీసుకుంటున్నట్టు ఏలూరు జిల్లా ఆర్ డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎల్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ త్రినాథబాబు, ఎంపీడీవో మురళీ గంగాధర్‌రావు, ఈవోపీఆర్‌డీ లక్ష్మీనారాయణతో కలసి ముదినేపల్లి మండలంలోని మంచినీటి చెరువులను, కాల్వలకు విడుదలైన నీటి వినియోగాన్ని పరిశీలించారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద పోల్ రాజ్, క్యాంప్ బెల్, బంటుమిల్లి ప్రధాన కాల్వలకు విడుదల చేసిన నీటి పరిమాణాన్ని పరిశీలించారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీరు చెరువులను నింపేందుకు సరిపోదన్న విషయాన్ని ఎస్‌ఈ గుర్తించారు. ఆయన మాట్లాడుతూ కాల్వలకు నీటి విడుదలను పెంచే విషయా న్ని ఇరిగేషన్ కృష్ణా తూర్పు డెల్టా ఎస్‌ఈ ప్రసాద్‌బాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలో 158 మంచినీటి చెరువులు ఉండగా, సుమారు 50 చెరువవులను నింపడం ప్రారంభించినట్టు తెలిపారు. కాల్వల శివారు ప్రాంతాల చెరువులను నింపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, నీటి అక్రమ వినియోగం జరుగకుండా నిఘా బృందాలు పని చేస్తున్నట్టు ఎస్‌ఈ తెలిపారు.



| 10-04-2024 పొగాకు ధరలు (రూ.) పొగాకు కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం | సరాసరి |
|---|---|---|---|
| దేవరపల్లి | 242 | 225 | 235.57 |
| జంగారెడ్డిగూడెం-1 | 242 | 235 | 240.23 |
| జంగారెడ్డిగూడెం-2 | 242 | 235 | 239.81 |
| కొయ్యలగూడెం | 244 | 235 | 240.04 |
| గోపాలపురం | 243 | 235 | 239.89 |



# రంజాన్ సందడి



ఏలూరులో ప్రార్థనలు



కైకలూరులో ప్రార్థనలు చేస్తున్న కామినేని



గురువారం జిల్లా అంతటా రంజాన్ సందడి నెలకొంది. ముస్లింలు మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. చిన్నారులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ పార్టీల నాయకులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.



భీమవరంలో శుభాకాంక్షలు తెలుపుతున్న రామాంజనేయులు



ఏలూరులో చిన్నారి ప్రార్థన..



రంజాన్ శుభాకాంక్షలు



ఆకివీడులో మాజీ ఎమ్మెల్యే శివ, ఏలూరులో ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి చంటి, పాలకొల్లులో ఎమ్మెల్యే రామానాయుడు ప్రార్థనలు



అప్పనవీడులో చింతమనేని, తణుకులో ఆరిమిల్లి ముస్లింలకు శుభాకాంక్షలు

# వలంటీర్లకు టీడీపీ భరోసా






**అధికారంలోకి రాగానే రూ.10 వేలు**

**యథావిధిగానే వలంటీర్ల సేవలు**

**చంద్రబాబు హామీ**

**రాజీనామా చేయాలంటూ**

**పక్కదారి పట్టిస్తున్న అధికార పార్టీ నేతలు**

(భీమవరనం-ఆంధ్రజ్యోతి)

*మాకు రాజకీయాలు ఎందుకు. ప్రభుత్వం ఏది చెపితే అదే చేస్తాం. అధికారులు చెపుతున్న పనులు మాత్రమే నిర్వహిస్తాం. ఎన్నికలతో మాకు సంబంధం లేదు. అధికారులు తీసుకోమన్న సమాచారం మాత్రమే తీసుకుంటున్నాం. అంతే తప్ప ఎన్నికల్లో రాజకీయ పార్టీల తరపున పాల్గొనేదీ లేదు. అది మాకు సంబంధం లేని విషయం. ఇది తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓ వలంటీర్ వ్యాఖ్య.*

*నేను చదువుకున్నాను. వలంటీర్‌గా వెళితే ఆర్థికంగా ప్రయోజనం ఉంటుందని భావించాను.ఇంటర్వ్యూలో అర్హత సాధించాను. అధికారులు చెప్పిన పనే చేశాను. రాజకీయాలతో నాకు సంబంధం లేదు. వెళ్లను కూడా. వేతనం పెంచుతామంటే మంచిదే కదా. ప్రభుత్వానికే మేము బాధ్యులం. కానీ పార్టీకి కాదు. ప్రచారం చేయమంటే నేను చేయనంటూ తణుకులో మరో వలంటీర్ చెప్పిన మాటలివి.*

### రాజకీయాలకు దూరంగా ఉంటే భవిష్యత్తు

వలంటీర్లకు తెలుగుదేశం భరోసా ఇచ్చింది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వేతనాన్ని రూ.10 వేలు చేస్తామంటూ తెలుగుదేశం అధినేత చంద్రబాబు భరోసా ఇచ్చారు. వలంటీర్లు ప్రభుత్వ విధులకే పరిమితం కావాలి. పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దంటూ సూచించారు. అయితే అధికార పార్టీ నేతలు మాత్రం వలంటీర్లను భ్రమల్లో పెడుతున్నారు. రాజీనామాలు చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో కొంతమంది వలంటీర్లు రాజీనామా చేశారు. వాస్తవానికి ఒక దశలో వలంటీర్లు తమ వేతనాన్ని పెంచాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వలంటీర్లు సేవకులు అంటూ జగన్ సంబోధించారు. వేతనాలు పెంచలేదు. పెన్షన్‌లు పంపిణీ, సంక్షేమ పథకాలు పంపిణీలో దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీనిని తెలుగుదేశం కూటమిపైకి వైసీపీ నెట్టే ప్రయత్నం చేసింది. ఎన్నికల వేళ తమకు ఉపయోగపతారని భావించిన వైసీపీ ఈసీ ఆదేశాలతో ఖంగతింది. జిల్లాలో వలంటీర్లతో రాజీనామాలు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికల్లో అధికార పార్టీకి వంతపాడేలా పన్నాగం చేశారు. అయితే వలంటీర్లను కొనసాగిస్తామంటూ చంద్రబాబు హామీ ఇచ్చారు. వేతనం పెంచుతామంటూ భరోసా కల్పించారు. జిల్లాలో 9200 మంది వలంటీర్లు ఉన్నారు. ఇప్పటిదాకా 1062 మంది వలంటీర్లు తమ రాజీనామాలను సమర్పించారు. అయితే రాజీనామాలకు, ఎన్నికల్లో పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటే వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉండే అవకాశం ఉంది. దానికితోడు ఉన్నత విద్య అభ్యసించిన వలంటీర్లకు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుంది.

## సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

### ఎస్‌ఈబీ రాష్ట్ర జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని ఎస్‌ఈబీ రాష్ట్ర జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్‌ఈబీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ మద్యం, సారా, నగదు అక్రమ రవాణా జరుగకుండా చూడాలన్నారు.అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఏ సమస్య వచ్చినా సత్వరం పరిష్కరించాలన్నారు. జిల్లాలో చేపట్టిన చర్యలను ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు వివరించారు. ఎస్‌ఈబీ డీఎస్పీ జనార్దన్ నాయుడు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గణపతిరావు, ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్, జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఒక వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం ద్వారకానగర్‌కు చెందిన ఉద్దవల్లి కిషోర్ (37)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బార్బర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ అవసరాలు నిమిత్తం అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేక గురువారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని అపస్మారక స్థితిలో ఉండగా అతని భార్య గమనించి ఇరుగుపొరుగు వారి సహకారంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి ఈ సంఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కిషోర్ మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

### రెండు బైక్‌లు ఢీ..ఇద్దరి మృతి



మృతి చెందిన జలపాలు, సాయి



జీలుగుమిల్లి, ఏప్రిల్ 11 : జీలుగుమిల్లి శివారు రమణక్కపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. టి.నరసాపురం మండలం బండివారిగూడెంకు చెందిన రాయల జలపాలు, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరానికి చెందిన వసం తవాడ సాయి జాతీయ రహదారిపై బైక్‌లపై వస్తూ ఎదురెదురుగా రమణక్కపేట సమీపంలో ప్రమాద వశాత్తు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రాయల జలపాలు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి సాయి ఆస్పత్రికి తరలి స్తుండగా మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ వి.చంద్రశేఖర్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అప్పు సొమ్ము అడిగినందుకు దాడి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : అప్పు ఇచ్చిన సొమ్ము ఇమ్మని అడిగినందుకు ఇద్దరు వ్యక్తులు దాడి చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు చెందిన మండలపు వంశీ ప్రదీప్ ఆక్వా ఫుడ్ వ్యాపారం చేస్తూంటాడు. గణపవరానికి చెందిన పువ్వల పవన్‌కుమార్, రాజేష్‌లకు కొంత సొమ్ము అప్పుగా ఇచ్చాడు. ఆ సొమ్ము తీర్చాలని అడగడంతో పవన్‌కుమార్, రాజేష్‌లు షాపునకు వచ్చి షాపులోని ఫర్నీచర్ ధ్వంసం చేసి దాడి చేశారు. దీంతో బాధితుడు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : ఆన్‌లైన్‌లో మోసపోయిన ఒక బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఏలూరు శనివారపుపేటనకు చెందిన ఏగంపాటి సత్యదుర్గ సాయి కిరణ్ తన ఫోన్‌లో అనూషా హెచ్‌ఆర్ మేనేజర్ అనే లింకు ఓపెన్ చేసి వారు ఇచ్చిన టాస్క్‌లను ఆడాడు. ఒక్కో టాస్క్‌కు ఒకొక్క రేటు పెట్టారు. కట్టిన రేటుకు డబుల్ అమౌంట్ వస్తుందని నమ్మడంతో దఫదఫాలుగా మూడు లక్షల 20 వేలు రూపాయలు కట్టారు. మొదటిలో రెట్టింపు వచ్చింది. ఆ తరువాత డిపాజిట్ చేసిన సొమ్ములను తిరిగి ఇవ్వకుండా మోసం చేశారు. తాను మోస పోయానని గమనించి బాధితుడు ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గోదావరిలో దూకిన కుటుంబం ?

### భర్త మృతదేహం లభ్యం



భార్య యోచనతో కిషోర్ కుమార్ (ఫైల్ ఫొటో)

యలమంచిలి, ఏప్రిల్ 11: భీమవరానికి చెందిన బొంతు కిషోర్ కుమార్ (32), అతని భార్య యోచన, రెండేళ్ల కుమార్తె నిధిశ్రీ చించినాడ బ్రిడ్జి వద్ద గోదావరిలో దూకారని భర్త మృత దేహం లభ్యమైనట్టు ఎస్‌ఐ కె.శివన్నారాయణ తెలిపారు. ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న కిషోర్ కుమార్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం కిషోర్ సోదరుడు ఉదయ కిరణ్ అతనికి ఫోన్ చేయగా ఎవరో ఫోన్ లిఫ్ట్ చేసి ఈ మొబైల్ చించినాడ బ్రిడ్జిపై ఉందని, దీంతోపాటూ బ్యాగ్, చెప్పులు ఉన్నాయని చెప్పారు. దీంతో వెంటనే అతని బంధువులు బ్రిడ్జి వద్దకు చేరుకుని ఆ వస్తువులు కిషోర్‌కు చెందినవిగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిషోర్ కుటుంబం ఆచూకీ కోసం పోలీసులు గురువారం గోదావరిలో గాలించగా సాయంత్రం కిషోర్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. అతని భార్య, కుమార్తెల ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపి వేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని ఎస్‌ఐ తెలిపారు.శుక్రవారం ఉదయం గాలింపు కొనసాగిస్తామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### కవిటంలో రెండు తాటాకిళ్లు దగ్ధం

పోడూరు, ఏప్రిల్, 11 మండలంలోని కవిటం శివారు పాటిమీద గురువారం గ్యాస్ లీకై మంటలు చెలరేగి రెండు తాటాకిళ్లు దగ్ధం అయ్యాయి. అన్నదమ్ములు ఉడుం బాలకృష్ణ, కోటేశ్వరరావుకు చెందిన తాటాకు ఇంటిలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో వీరి ఇంటికి ఆనుకుని ఉన్న మారుమూడి శ్రీనుకు చెందిన తాటాకిల్లు కూడా దగ్ధం అయ్యింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆదుపు చేశారు. అప్పటికే ఇళ్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి. తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్‌ఐ కందుల రాంబాబు, వీఆర్వో ఆంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు. రూ.3 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని రెవెన్యూ, అగ్ని మాపక సిబ్బంది తెలిపారు.బాధిత కుటుంబాలకు 40 కిలోల బియ్యం అందజేశారు.



ఎంపీడీవోకు రాజీనామాలు అందజేసిన జనార్దనవరం వలంటీర్లు

## మూకుమ్మడి రాజీనామాలు ?

### ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 503 మంది రాజీనామా

ఏలూరుసిటీ, ఏప్రిల్ 11: గ్రామాల్లో, పట్టణాల్లో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేయడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నారని ప్రకటిస్తున్నా ఇందులో రాజకీయ కోణం ఇమిడి ఉందనే విమర్శలు ప్రతిపక్షాల నుంచి వినబడుతున్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం ఎన్నికల విధుల్లో వలంటీర్లను వినియోగించ రాదని ఆదేశాలు జారీ చేసిన తర్వాత రాజీనామాలు ఎక్కువయ్యాయన్నారు.అధి కార పార్టీకి వలంటీర్లు కార్యకర్తలుగా పనిచేస్తున్నారనే విమర్శలు ప్రతి పక్షాల నుంచి వినవస్తున్నాయి.

ఏలూరు జిల్లాలో మొత్తం పట్టణాలతో కలిపి 31 మండలాల్లో సుమారు 10,600 మంది వలంటీర్ల విధులను నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఇప్పటివరకు 24 మండలాలకు సంబంధించి 503 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఎన్ని కల కోడ్ ఉల్లంఘించారనే ఫిర్యాదులు రావడంతో జిల్లాలో 15 మంది వలం టీర్లను తొలగించారు. మండలాల వారీగా పరిశీలిస్తే ఆగిరిపల్లిలో 13, భీమడోలులో 93, చాట్రాయిలో 20, చింతలపూడిలో ఇద్దరు,దెందులూరులో 92 మంది, ఏలూరు రూరల్‌లో 9 మంది, ఏలూరు అర్బన్‌లో 11 మంది, జంగారెడ్డిగూడెం రూరల్‌లో 9 మంది, జీలుగుమిల్లిలో 17 మంది, కైకలూరులో 46 మంది, కొయ్యలగూడెంలో ఏడుగురు, కుక్కునూరులో ఒకరు, మండవల్లిలో ఒకరు, ముదినేపల్లిలో 57 మంది, ముసునూరులో 28 మంది, నిడమర్రులో ఒకరు, నూజివీడు అర్బన్‌లో 12 మంది, రూరల్‌లో 38 మంది, పెదపాడులో ఒకరు, పెదవేగిలో ఒకరు, ఉంగుటూరులో 43 మంది వలంటీర్లు రాజీనామా చేయటం జరిగింది. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి 15 మంది వలంటీర్లను విదుల్నోంచి తొలగించారు. ఆగిరిపల్లిలో ఇద్దరు, చింతలపూడి అర్బన్‌లో నలుగురు, ఏలూరు రూరల్‌లో ముగ్గురు, కలిదిండిలో ఒకరు, కొయ్యలగూడెంలో ఇద్దరు, పెదవేగిలో ఒకరు, ఉంగుటూరులో ఇద్దరు వలంటీర్లను వివిధ ఫిర్యాదులపై విచారణ జరిపి తొలగించారు.

**చాట్రాయి మండలంలో 20 మంది..**

చాట్రాయి, ఏప్రిల్ 11: మండలంలోని ఆరుగొలనుపేట గ్రామ వలంటీర్లు 8 మంది, జనార్దనవరం గ్రామ వలంటీర్లు 12 మంది మొత్తం 20 మంది తమ రాజీనామా పత్రాలను గురువారం ఎంపీడీవో మంగాకుమారికి అందజేశారు.



బొత్తప్పగూడెంలో సారా ఊట ధ్వంసం చేస్తున్న సిబ్బంది

## 114 లీటర్ల మద్యం, లక్షా 85 వేలు స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11 : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 25,740 రూపాయల విలువైన 114 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో లక్షా 85 వేలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

**లక్ష నగదు స్వాధీనం**

చింతలపూడి, ఏప్రిల్ 11: చింతలపూడి మండలం లింగగూడెం చెక్‌పోస్టు వద్ద పత్రాలు లేని రూ.లక్ష నగదును ఎస్.ఎస్.టీమ్ తనిఖీలో పట్టుకున్నట్లు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు. చింతలపూడికి చెందిన మందలపు వెంకట నారాయణ అనేవ్యక్తి ఈ నగదును తీసుకువెళుతుండగా ఎటువంటి పత్రాలు చూపకపోవడంతో ఈ నగదును జిల్లా ట్రెజరీలో జమ చేసినట్లు తెలిపారు.

**100 లీటర్ల సారా స్వాధీనం**

జీలుగుమిల్లి, ఏప్రిల్ 11: కామయ్యపాలెం గ్రామ శివారు బొత్తప్పగూడెం కాలువ సమీపంలో సారా తయారీ స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 100 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని సుమారు 2000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు.

## గన్నీ బ్యాగ్ గోదాములో అగ్ని ప్రమాదం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 11: ఏలూరు వన్ టౌన్ గడియార స్తంభం ప్రాంతంలోని గన్నీ బ్యాగ్ గోదాములో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఏలూరు వన్ టౌన్ ప్రాంతానికి చెందిన కర్రి శ్రీనివాసరావు గన్నీ బ్యాగ్ గోదాము నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో గమనించిన సిబ్బంది అగ్ని మాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.75 వేల ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. ప్రమాదానికి సంబంధించి కారణాలను సేకరిస్తున్నామని, ఏలూరు అగ్ని మాపక అధికారి వీవీ రామకృష్ణ తెలిపారు. సుమారు రూ. 1.75 లక్షల ఆస్తిని కాపాడామని ఆయన తెలిపారు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

## వైసీపీ పాలనలో జలవనరుల రంగం నిర్వీర్యం

నూజివీడు, ఏప్రిల్ 11: రాష్ట్రంలో జలవనరుల రంగాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సీనియర్ టీడీపీ నేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. గురువారం నూజివీడులో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో జలవనరుల రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చుచేసి 67 ప్రాజెక్టులు చేపట్టి, వాటిలో 23 ప్రాజెక్టులను పూర్తిచేసి 32 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించిందన్నారు. వైసీపీ గత ఐదేళ్లలో రూ.32 వేల కోట్లు ఖర్చుచేసి ఒక్కఎకరం కూడా స్థిరీకరించకుండా జలవనరుల రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు.

## బాలా త్రిపుర సుందరికి శాకంబరీ అలంకారం



భీమవరం టౌన్, ఏప్రిల్ 11 : వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో మూడో రోజు అమ్మవారికి శాకాంబరీ దేవిగా అలంకారం చేశారు. హౌసింగ్ బోర్డుకు చెందిన వాసంశెట్టి చంద్రశేఖర్, సీతాలక్ష్మి దంపతులచే అమ్మవారికి కుంకుమార్చ నను ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ చేశారు.

## 14న అష్టావధానం

భీమవరం టౌన్, ఏప్రిల్ 11 : ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు భీమవరం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో అష్టావధానం నిర్వహిస్తు న్నామని తెలిపారు. చిన్మయ ప్రభ అధ్యక్షుడు బొండా వెంకట సుబ్బారావు తెలిపారు. తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వ విద్యాలయంలోని 17 సంవత్సరం విద్యార్థి ఉప్పల దడియం భరత్ శర్మ చే అష్టావధాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

## నిప్పుల గుండం తొక్కిన భక్తులు

ఉండి, ఏప్రిల్ 11: వీరపేరంటాలమ్మ ఆలయం వద్ద నిప్పులు గుండం తొక్కే కార్యక్రమం నిర్వహించారు. వెలివర్రులో అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. నిప్పులగుండం కార్యక్రమంను క్రొవ్విడి సూర్యశంకర లక్ష్మీనరసింహారావు పర్యవేక్షణలో నిర్వహించారు.

## స్వచ్ఛందంగా రైతులు తూడు తొలగింపు



నరసాపురం రూరల్, ఏప్రిల్ 11: రామన్నపా లెం పంట కాల్వ గుర్ర పుడెక్క, తూడుతో నిండిపోయింది. శివారు ప్రాంత వ్యవసాయ భూములకు సాగునీరు అందడం లేదు. వరి పనలు పాలు పోసుకునే దశలో ఉండటంతో సాగు నీటి కోసం కటకటలాడి పోతున్నారు. అధికారులకు సమస్యను వివరించినా.. పట్టించుకోలేదు. దీంతో వైఎస్‌పాలెం గ్రామానికి చెందిన రైతులే పంట కాల్వలో దిగి తూడు తొలగిం చారు. సీతారాంపురం, రామన్నపాలెం, వైఎస్‌పాలెం గ్రామాలకు చెందిన సుమారు 300 ఎకరాలు రైతులు సాగు చేస్తున్నారు. అయితే పంట చివరి దశలో నీరు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు వైఎస్ బాబులతో పాటు రైతులు కె.సూర్యనారాయణ, రామచంద్ర, మోహన్‌రావు, శ్రీను, ముత్యం, బుజ్జీ తదితరులు పంట కాల్వలో దిగి డెక్క, తూడు తొలగించారు.

## బొలిశెట్టిని భారీ మెజారిటీతో గెలిపించాలి: బాబ్జి



ప్రచారం చేస్తున్న వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 11 : నియోజకవర్గ అభివృద్ధి కోసం ఉమ్మడి కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని స్థానిక ఏడో వార్డులో గురువారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు.

## ఇచ్చింది తక్కువ... దోచిందే ఎక్కువ: నాయకర్



నరసాపురంలో ఓటర్లకు కరపత్రాలు అందిస్తున్న జనసేన అభ్యర్థి నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి రామరాజు

నరసాపురం, ఏప్రిల్ 11: సంక్షేమం పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజల ఖాతాల్లో వేసినదాని కంటే దోచిందే ఎక్కువని జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం పట్టణంలోని 28, 29వార్డుల్లో టీడీపీ, బీజేపీ పార్టీలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటి పన్ను, చెత్త పన్ను, కరెంట్ చార్జీలు భారీగా పెంచిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పది రూపాయలు ఇచ్చి రూ.100 దోచేసిన మోసగాడు అన్నారు. ఈసారి మళ్లీ అధికారంలోకి వస్తే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పూటగడవడమే కష్టంగా మారుతు ందన్నారు. టీడీపీ, బీజేపీ కన్వీనర్లు పొత్తూరి రామరాజు, మేకల సతీశ్ మాట్లాడుతూ ఐదేళ్లల్లో నరసాపురంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు.

## టీడీపీలో చేరిక



రేలంగిలో టీడీపీ అభ్యర్థి ఆరిమిల్లి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

ఇరగవరం, ఏప్రిల్ 11: తణుకు పట్టణంలో ప్రజా గళం సభ విజయవంత మైందని టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం రేలంగి గ్రామంలో వందల మంది టీడీపీలో చేరేందుకు ముందుకు వచ్చారు. వారికి పార్టీ కండువా కప్పి స్వాగ తం పలికారు. ప్రగడ అప్పారావు, ప్రగడ శ్రీనివాసరావు, మీనవల్లి చంటి, అడ్డాల సత్యనారాయణ, అన్యం మెంటారావు, అడ్డాల నాయుడు ఆధ్వర్యంలో ఈ చేరికలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు మానే భాస్కరరావు, కామన ఏడుకొండలు, గూడూరి నాగరాజు, అడ్డాల మెంటారావు, గరగ శ్రీను, చేగొండి హరిబాబు, పసుపులేటి అబ్బులు, ఉన్నటి ప్రభువు, చుక్కా సాయిబాబా, పసుపులేటి గణేష్, కాసాని వెంకన్న బాబు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవినీతి, అభివృద్ధిపై చర్చకు సిద్ధం: ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 11 : 'తణుకు నియోజకవర్గంలో అవినీతి, అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం. సమయం, తేదీని మంత్రి కారుమూరి చెబితే తణుకులో నరేంద్ర సెంటర్‌లో బహిరంగ చర్చకు తామంతా వస్తామని, ప్రజల ముందు అన్ని విషయాలు మాట్లాడదాం' అని టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ గురువారం మంత్రి కారుమూరికి సవాల్ చేశారు. టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాగళం సభ విజయవంతం కావడంతో కారుమూరి కళ్లు బైర్లు కమ్మాయని, అర్థం కాకుండా ఏదో మాట్లాడేస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, కలగర వెంకటకృష్ణ, చిక్కాల వేణు, ఆనాల ఆదినారాయణ, దాసం ప్రసాదు, గోపిశెట్టి రామకృష్ణ, ఆకేటి కాశి, వేండ్ర నాగు, ఆల్తి సత్యనారాయణ, కడియాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో ప్రజలకు అన్నీ అవస్థలే: కృష్ణ తులసి

తణుకు, ఏప్రిల్ 11 : వైసీపీ పాలనలో నిత్యావసర ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసీ అన్నారు. గురువారం పట్టణంలోని 16వ వార్డులో కూటమి తరపున ఆమె ప్రచారం నిర్వహించారు. పెట్రోల్ బంకు వద్ద వాహనదారులతో మాట్లాడుతూ పెట్రోల్ కొట్టి.. ధరల పెంపుపై లెక్కలతో సహా వివరించారు.

## ఏటా మూడు సిలిండర్లు ఇస్తాం: సూర్యకుమారి

పాలకొల్లు టౌన్: రానున్న ఎన్డీయే ప్రభుత్వంలో మహిళలకు వంటింటి కష్టాలు లేకుండా ఏటా మూడు సిలిండర్లు పంపిణీ చేస్తామని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. పాలకొల్లు పట్టణంలోని 12వ వార్డులో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజలే దేవుళ్లగా కొలిచే ప్రజానాయకుడు నిమ్మల రామానాయుడును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## రూ.నాలుగు వేల పింఛన్ అందిస్తాం: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 11: తమ కూటమి అధికారంలోకి రాగానే ఏప్రిల్ నుంచి నాలుగువేల రూపాయల పింఛన్ అందిస్తామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. నీలాద్రిపురంలో పల్లెపోరు కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు. ఆయనతోపాటు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీలు కలిసి పల్లెపోరు కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







గణపవరంలో పేదలకు సహాయం.. మొగల్తూరులో ముస్లింల ప్రదర్శన.. ఉండిలో రంజాన్ వేడుకల్లో చిన్నారులు

# జిల్లా అంతటా రంజాన్ వేడుకలు

### ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు.. ప్రదర్శనలు... పలు ప్రాంతాల్లో సేమ్యా పంపిణీ

నరసాపురం టౌన్, ఏప్రిల్ 11: పట్టణ, మండ లంలో రంజాన్ పండుగను గురువారం ముస్లిం లు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని మిషన్ హైస్కూల్ రోడ్‌లోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని పాతబజార్, పీచుపాలెం సెంటర్లలోని మసీదుల్లో నమాజ్‌లు చేశారు. అంతకు ముందు పాతబజార్ సెంటర్ లో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అక్కడి నుంచి ఈద్గా వరకు ప్రదర్శనగా వెళ్లారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, జనసేన కన్వీనర్ నాయకర్ విచ్చేశారు. ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**ఆకివీడు:** సర్వమత సౌభ్రాతృత్వానికి, మత సామరస్యం, త్యాగానికి, శాంతికి ప్రతీక రంజాన్ అని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ మదనీ అన్నారు. రంజాన్ సందర్భంగా గురువారం పట్టణంలో భారీ ర్యాలీ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**పాలకొల్లు అర్బన్:** ఎల్ఆర్‌పేటలోని ఈద్గా లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో సున్నీ జామియా మసీదు ట్రస్టీ మహ్మద్ రఫీ, పలువురు ముస్లింలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముస్లింలకు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు శుభాకాంక్షలు తెలిపా రు. స్థానిక అన్నా క్యాంటిన్ సమీపంలో షేక్ మహ్మద్ మదీనా జానీ (ఫ్లవర్ మదీనా) ఆధ్వర్య ంలో 500 మందికి సేమ్యా పాయసం పంపిణీ చేశారు.

**పాలకోడేరు:** గరగపర్రు, పాలకోడేరు, పెన్నాడ, శృంగవృక్షం గ్రామాలలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో మండల ముస్లిం నాయకుడు షేక్ పాపా సాహెబ్, బురాన్ సాహెబ్, ఖాన్, శంకరం, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదు లను భీమవరం రూరల్ సీఐ సత్యకిషోర్, ఎస్ఐ నాళం శ్రీనివాసరావు సందర్శించి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

**ఉండి:** అల్లాకు ప్రార్థనలు చేయడం ద్వారానే ఆయా కుటుంబాలు ఆశీర్వదించబడతాయని జామియా మసీదు గురువు షేక్ హర్షద్ అన్నారు. గురువారం ఉండిలో రంజాన్ వేడుకలను ముస్లింలు జరుపుకున్నారు. ప్రార్థనలు అనంతరం చిన్నారులను ఆశీర్వదించారు. తదుపరి ప్రత్యేకంగా తరయారు చేయించిన సేమియా స్వీట్‌ను పంచిపెట్టారు. ఉండి బస్‌స్టాండ్ నుంచి భీమవరం వెళ్లు ప్రయాణికులకు ప్రత్యేకంగా గ్లాసులలో సేమియాను వేసి పంచిపెట్టారు.

**గణపవరం:** గణపవరంలో ఉదయం నుంచే వందలాది మంది ముస్లింలు మసీదులకు చేరుకున్నారు. ఒకరికి ఒకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. మసీదు గురువు అరమాన్ రజాక్ ఖదారి ఖురాన్ చదివి వినిపించారు. అనంతరం ఖీర్ సేమియాను ముస్లింలతో పాటు హిందువులు కూడా ఆరగించారు.

**భీమవరం టౌన్:** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని భీమవరం జనసేన కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. రంజాన్ సందర్భంగా నరసయ్య అగ్రహారంలోని సున్ని జామియా ఈద్గా మసీదులో ఆయన పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఖురాన్ బోధనల ప్రభావం సమాజంపై ఎంతగానో ఉంటుందని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, బండి రమేష్ కుమార్, టీడీపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, గంటా త్రిమూర్తులు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో గురువారం ఘనంగా నిర్వహించారు. దయాల్‌దాస్‌పేటలోని ఈద్గా నుంచి ఖబరిస్తాన్ వరకూ అల్లాను స్మరిస్తూ ప్రదర్శనగా వెళ్లారు. అక్కడ పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ సందర్భంగా తాడేపల్లిగూడెం పట్టణంలోని పెద్ద మసీదు సమీపంలో షాదీఖానా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు, మౌలానా మహ్మద్ అన్వర్ ఖాసిం ఈద్ ప్రార్థనలు చేయించారు. పట్టణంలోని శశి కళాశాల సమీపంలోని వాకర్స్ గ్రౌండ్ వద్ద, ఆరుగొలను, అప్పారావుపేట, కొండ్రుప్రోలు తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

**పెంటపాడు :** పెంటపాడు మసీదులో ముస్లింలు నమాజ్ చేసుకుని అనంతరం ఒకరికొ కరు అలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలుపు కున్నారు. పెంటపాడులో బిస్మిల్లా టిఫెన్ సెంటర్ అధినేత షేక్ హాజీ ప్రజలకు పాయసం పంపిణీ చేశారు. కె.పెంటపాడు, ప్రత్తిపాడు, అలంపురం తదితర గ్రామాలలో రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

**తణుకు:** పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భ ంగా పట్టణంలోని కొమ్మాయిచెర్వు గట్టువద్ద ఉన్న ఈద్గాలో ముస్లింలతో కలిసి కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ ప్రాముఖ్యతను ముస్లిం మతపెద్దలు వివరించారు.

**పాలకొల్లు టౌన్:** రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలతో కలిసి టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం షాదీ ఖానాను పూర్తి స్థాయిలో నిర్మాణం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.







పాలకొల్లులో పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర.. పూలే చిత్రపటం వద్ద జనసేన అభ్యర్థి బొలిశెట్టి నివాళులు.. పాలకొల్లులో కాంగ్రెస్ నాయకుల నివాళులు

# అణగారిన వర్గాలకు జ్యోతిరావుపూలే అండ

### ఘనంగా జయంతి వేడుకలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 11: అణగారిన వర్గా లకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు బి.బలరాం, కోనాల భీమారావు, భీమవరం కాంగ్రెసు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అంకెం సీతారాం అన్నారు. జ్యోతి రావు పూలే 197వ జయంతి సందర్భంగా గురు వారం టీడీపీ పట్టణ కార్యాలయంలో సీపీఎం సీపీఐ, కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

**భీమవరం అర్బన్:** మనువాద భావజా లాల్ని ప్రతిఘటించిన ఆధునిక సామాజిక విప్లవ వీరుడు జ్యోతిరావు పూలే అని దళిత ప్రజా సంఘాల నాయకులు అన్నారు. గురువారం ప్రకాశం చౌక్ వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**పాలకొల్లు అర్బన్:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్య ంలో పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి, గాంధీబొమ్మల సెంటర్‌లో పూలే విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించా రు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలుకులూరి అర్జునరావు, పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ, పీసీసీ సభ్యులు మహ్మద్ జానీ (ఫ్లవర్‌మదీనా), రొఖ్ఖాల బెన్నీపాల్, కాసు, మోహన్‌రావు పాల్గొ న్నారు. పట్టణ బిజేపి ఆధ్వర్యంలో గాంధీబొమ్మల సెంటర్‌లో పూలే విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొల్లి నరసింహమూర్తి, కొల్లి కొండ ప్రసాద్, కొణిజేటి గుప్త, బైలా శ్రీధర్, గవర పవన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలోనూ, గాంధీ బొమ్మల సెంటర్‌లోని పూలే విగ్రహానికి పార్టీ ఇన్‌చార్జీ, ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి, పట్టణ నాయకులు స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌సి,ఎస్టీ, బిసి, మైనార్టీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీబొమ్మల సెంటర్‌లో పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

**ఆచంట:** తూర్పుపాలెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రంగనాథరాజు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాలులు అర్పించారు. అలాగే కొడమంచిలిలో టీడీపీ ఆధ్వ ర్యంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ సర్పంచ్ చిలుకూరి శ్రీను, బాలం వెంకట రమణ, మన్నె తేజ, కట్టా సుబ్బారావు పాల్గొన్నారు.

**పాలకొల్లు టౌన్:** మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో బీసీల అభివృద్ధి, సంక్షేమంతో పాటు రుణం తీర్చుకునేలా పనిచేస్తానని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీబొమ్మల సెంటర్లో జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే రామానాయుడు, మాజీఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయంతి వేడుకల్లో బీసీ కుల వృత్తిదారులు నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, జిల్లా టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, మామిడిశెట్టి పెద్దిరాజు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఉన్నమట్ల కబర్ది పాల్గొన్నారు.

**గణపవరం:** గణపవరంలో వివేకానంద సేవా సమితి కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు, అల్లూరి గంగరాజు, రిటైర్డ్ లైబ్రేరియన్ సూర్యరాజు, రిటైర్డ్ పీడీ గాదిరాజు గోపాలకృష్ణం రాజు, నంద్యాల సుబ్బరాజు పాల్గొన్నారు.

**పెనుగొండ:** పెనుగొండలో జ్యోతిరావుపూలే విగ్రహానికి మాజీ మంత్రి పితానిసత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమలో సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, మల్లుల లక్ష్మీనారాయణ, పిల్లి సత్తి రాజు, వేండ్ర రాము, కటికిరెడ్డి నానాజీ, మండా ప్రసాద్, గుబ్బల సూర్యనారాయణ, బీరా నరసిం హమూర్తి పాల్గొన్నారు.

**తణుకు:** అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నా రు. గురువారం పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు.

**తాడేపల్లిగూడెం అర్బన్:** మహనీయుల ఆశయాలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవా లని నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీని వాస్ అన్నారు. గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## ఎస్ఎల్-10,పీఆర్126 వరి పంటలను కొనాలి



దేవలో పంటలు పరిశీలిస్తున్న కౌలు సంఘ నాయకులు

పెనుగొండ, ఏప్రిల్ 11: ఈ దాళ్వాలో జిల్లాలో అధిక సాగు చేసిన ఎస్ఎల్ -10, పీఆర్ -126 వరి రకాలను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయా లని ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. గురువారం దేవ గ్రామంలో కౌలు రైతు సంఘ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్య క్షుడు కె.గోపాలన్ మాట్లాడుతూ అధిక దిగుబడులతో పాటు ఎటువంటి చీడ పీడలనైన తట్టుకోగల శక్తి ఉన్న ఈ వరి రకాలను రైతులు విరివిగా పండించారన్నారు. ఇప్పటికే జిల్లాలో కోతకు వచ్చిన ఈ వరి రకాలను రూ.1673లకు, 1121 వరి రకాలను రూ.1637లకు మద్దతు చెల్లించవలసి ఉండగా మిల్లర్లు, కమిషన్ దార్లు కుమ్మక్కై పచ్చి ధాన్యం పేరుతో బస్తా రూ.1230 నుంచి రూ.1250 వరకు కొనుగోలు చేసి రైతును విపరీతంగా దోపిడి చేస్తున్నారన్నారు.

## 'టిడ్కో లబ్ధిదారుల కష్టాలు వర్ణనాతీతం'

భీమవరం టౌన్, ఏప్రిల్ 11 : టిడ్కో లబ్ధిదారుల కష్టాల వర్ణతీతంగా ఉన్నాయని, టీడీపీ పాలనలో ఇచ్చిన ఇళ్లకు రంగులు వేసుకున్నారే తప్ప వారికి మౌలిక వసతులు కల్పించడంలో ఈ నాయకులు విఫలం అయ్యారని జనసేన, టీడీపీ నాయకులు విమర్శించారు. పట్టణంలోని 12వ వార్డులో టిడ్కో నివాసాల వద్ద నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజిబాబు కుమారుడు ప్రశాంత్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు, వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 9 వేలకు పైగా లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తే ఐదేళ్లు గడిచినా జగన్ పాలనలో వారికి ఇప్పటికీ సరైన వసతులు కల్పించలేదని విమర్శించారు.

## గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం: శివ



ఆకివీడు రూరల్‌లో పర్యటిస్తున్న శివ

ఆకివీడు రూరల్ / కాళ్ల, ఏప్రిల్ 11: గ్రామాలలో రక్షిత తాగునీరు పుష్క లంగా అందజేస్తానని ఉండి స్వతంత్ర అభ్యర్థి శివ రామ రాజు అన్నారు. అజ్జ మూరు, కుప్పనపూడి, అయిభీమవరం, మందపాడు, చెరుకుమిల్లి గ్రామాలలో ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. గతంలో తన హయాంలో చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ దానికి మించిన అభివృద్ధి చేస్తానని, ప్రధానంగా తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు మెరుగుపరుస్తానని అన్నారు. ఆకివీడులో ముస్లింలతో కలిసి శివ ప్రార్థనలు చేశారు. కోమటిగుంటలోని కల్కి భగవాన్ ఆలయ 11వ వార్షికో త్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్లను మాజీ ఎమ్మెల్యే శివ తనయుడు అభిరామ్‌వర్మ దర్శించుకుని పూజలు నిర్వహించారు. తన తండ్రి శివరామరా జుకి మద్దతు తెలపాలని కోరారు.

## మండుతున్న ఎండలు.. రోడ్లు నిర్మానుష్యం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 11 : ఎండలు మండుతున్నాయి. గురువారం భానుడు తన ప్రతాపాన్ని చూపించారు. అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు విలవిల్లాడిపోయారు. ఉదయం 10గంటల నుంచి వేడిగాలులు వీయడంతో ప్రధాన రహదారులు అన్నీ నిర్మానుష్యంగా మారాయి. మార్కెట్‌లో వ్యాపారులు 11 గంటలకు వ్యాపారాలు లేక నిరుత్సాహంతో వ్యాపారులు ఉన్నారు. ప్రజలు ఇళ్లలోంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 5 గంటలకు కొంత వేడి తగ్గడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పుడే ఎండలు ఈమాదిరిగా ఉంటే మేనెలలో పరిస్థితి ఏలాఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

## హైదరాబాద్‌కు ఇంద్ర సర్వీసు

భీమవరం టౌన్, ఏప్రిల్ 11 : భీమవరం నుంచి హైదరాబాద్ (బీహెచ్‌ఈఎల్) ఇంద్ర బస్ సర్వీసు వయా బంటుమిల్లి, పెడన,మచిలీపట్టణం మీదుగా ప్రారంభిం చామని డిపో మేనేజర్ పీఎస్‌వి సత్యనారాయణమూర్తి తెలిపారు. రాత్రి 9 గంటలకు భీమవరంలో బయలుదేరి గొల్లవానితిప్ప ,కృత్తివెన్ను, బంటుమిల్లి మీదుగా ఇంద్ర బస్ హైదారాబాద్ - బీహెచ్‌ఈఎల్ చేరుకొని ఈ సర్వీసు తిరిగి మరలా బీహెచ్‌ఈఎల్ నుంచి సాయంత్రం 8-45 గంటలకు బయలుదేరి భీమవరం ఉదయం 6-25కు చేరుతుందన్నారు. టికెట్ ధర భీమ వరం నుంచి హైదరాబాద్‌కు రూ.1020గా నిర్ణయించామని అన్నారు.

## మద్యం దుకాణం తనిఖీ

ఉండి, ఏప్రిల్ 11: మద్యం దుకాణాలలో దిగుమతి చేసుకున్న విక్రయించిన సరుకంతా రికార్డు ప్రకారం వుండాలని ఎంపీడీవో రవీంద్ర, ఈవోపీఆర్‌డీ రామకృష్ణారెడ్డి, ఏఎస్ఐ సూర్యనారాయణ అన్నారు. గురువారం మహదేవపట్నంలోని మద్యంషాపును తనిఖీ చేశారు. దుకాణంలో సరుకును, విక్రయించిన సరుకు, వున్న సరుకును రికార్డు ప్రకారం పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అన్ని దుకాణాలను తాము తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఆచంటలో ధాన్యం కొనుగోలు ప్రారంభం

ఆచంట, ఏప్రిల్ 11: ఆచంటలోని రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు చేకూరి గోపాలకృష్ణకు సంబంధించి ట్రక్కు సీటు జనరేట్ చేసి తహసీల్దార్ ఐపీశెట్టి అందజేశారు. రై తులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కా ర్యక్రమంలో ఏవో బి. నాగరాజు, సొసైటీ కార్యదర్శి వేండ్ర విష్ణు, ఆర్‌బీకే ఇన్‌చార్జి శృతి పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి: ఆర్వో



ఆర్వో స్వామి నాయుడు

ఆచంట, ఏప్రిల్11: రాజకీయ పార్టీ అభ్యర్థులు ఎన్నిక ల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వంటెద్దు స్వామి నాయుడు అన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసుల ద్వారా రూ. 8 లక్షల 44 వేల 220 రూపాయలు నగదు సీజ్‌చే యడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. మద్యం షా పుల అమ్మకాలపై కూడా నిఘా ఉందన్నారు. నియోజకవ ర్గంలోని 4 ఫ్లయింగ్‌స్క్వాడ్ టీమ్‌లు, 11 వీడియో బృందాలు తనిఖీలు చేస్తున్నాయని, అభ్య ర్థులు చేసే అదనపు ఖర్చులు ఈ బృందాలు ద్వారా రికార్డు చేస్తామని ఆర్వో తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల నమోదు కోసం కంట్రోల్‌రూమ్ 08814 297299 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వీటితోపాటు సివిజిల్ యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## రోగులకు కుండలు, విసన కర్రలు పంపిణీ

భీమవరం క్రైం, ఏప్రిల్ 11 : ప్రభుత్వాసుపత్రిలో 46 మంది రోగులకు కుండలు, కూజాలు, విసనకర్రలు, పండ్లు పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి కళ్యాణి మాట్లాడుతూ నీటి శాతం ఎక్కువగా ఉండే పదార్థాలను తీసుకోవాలని, విసనకర్రలు వేసవిలో ఉపశమన సాధనంగా ఉంటుందన్నారు. డాక్టర్లు రంగారావు, సుబ్బలక్ష్మీ, పద్మ, హారికలు వేసవిలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. నిర్వా హకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రిటైర్డ్ మున్సిపల్ టీచర్ జి.మార్టిన్ ఆర్థిక సహకారంతో 46 మందికి మట్టికుండలు, విసన కర్రలు అందించా మని తెలిపారు.

## టీడీపీ యాప్‌లో మొదటి ర్యాంకర్ పాతూరి

పెంటపాడు, ఏప్రిల్ 11 : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'మన టీడీపీ యాప్'లో సమాచారాన్ని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు ఐదు వేల మందితో యాప్‌ను డౌన్లోడ్ చేయించినందుకు మండ లంలోని మౌంజీపాడుకు చెందిన తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు పాతూరి రాంప్రసా ద్‌చౌదరి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా పాతూరిని గురువారం జరిగిన జూమ్ సమావేశంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యాదర్శి నారా లోకేష్‌బాబు ప్రశంసించారు.

## చంద్రబాబుకు జీఎంగా పవన్: ముద్రగడ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 11: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు జనరల్ మేనేజర్‌గా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పనిచేస్తున్నాడని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని మాగంటి కల్యాణ మండపంలో వైసీపీ ఆధ్వర్యంలో గురువారం కాపు ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ బేషరతుగా వైసీపీకి మద్దతు ఇచ్చిన ముద్రగడను రాజ్యసభకు పంపాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరం, వడ్డి రఘురాంనాయుడు తదితరులు ఉన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

కాళ్ళ, ఏప్రిల్ 11 : మాలవానితిప్ప గ్రామంలో గ్రామ సర్పంచ్ సాగిరాజు సుబ్బ రాజు ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రయాణి కులకు, గ్రామస్తులకు మజ్జిగ అందజేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు, ఏప్రిల్ 11 : గొల్లలకోడేరు పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గొల్లలకోడేరు, గరగపర్రు, యండగండి, షైపా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

**కాళ్ళ:** విద్యుత్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎస్సీ బోస్ కాలనీ గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివే స్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.


**పెంటపాడు:** శుక్రవారం మండలంలోని చింతపల్లి, కోరుమిల్లి, బి.కొండేపాడు, మీనవల్లూరు, రామచంద్రపురం, రావిపాడు గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఎలక్ట్రికల్ డీఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట, అమృతపురం, మోదుగగుంట, గొల్లగూడెం అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, ఎల్.అగ్రహారం, టిడ్కో ఇళ్ల సముదాయం, కొండ్రుప్రోలు, కేఎస్ఎన్ కాలనీ వాసులు సహకరించాలని కోరారు.

## మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ

నరసాపురం టౌన్, ఏప్రిల్ 11: పట్టణంలోని మీరా గ్రంథాలయం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల శిక్షణ శిబిరాన్ని రాజేష్‌జైన్ ప్రారంభించారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కవురు పెద్దిరాజు, ఎం. త్రిమూర్తులు, పి.రాము, కొండ, పూర్ణ, రూన్సీ లక్ష్మి పాల్గొన్నారు.

## నరసాపురం బీజేపీ కన్వీనర్‌గా సతీశ్



నియామకపత్రాన్ని అందిస్తున్న రవికుమార్

నరసాపురం, ఏప్రిల్ 11: నరసాపు రం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా మేకల సతీశ్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర చీఫ్ పురందేశ్వరి జారీ చేసిన నియామకపత్రాన్ని ఆపార్టీ జిల్లా కన్వీనర్ రవికుమార్ అందించారు. గురువారం స్టీమర్‌రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు నరసాపురం కన్వీనర్‌గా ఉన్న పీవీఆర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించామన్నారు. కొత్తగా నియమితులైన సతీశ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నరసాపురంలో పార్టీకి కార్యాలయం లేదన్నారు. తాను స్టీమర్‌రోడ్‌లో నిర్మించే భవనంలో ఒక ఫ్లోర్‌ను పార్టీకి ఇస్తున్నట్లు ప్రకటించారు. అందర్ని కలుపుకుంటూ పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేస్తామన్నారు. అనంతరం సతీశ్‌ను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈసమావేశంలో కంచర్ల నాగేశ్వరరావు, మునికోటి వెంకటేశ్వరావు, గునిశెట్టి శ్రీను, పండు, దిలీప్, శిరిషా, ఈశ్వర్, బులిసత్యం, బాబీప్రసాద్, కొండ, ఏసు, రాము పాల్గొన్నారు.

## చిరువ్యాపారులపై మాట్లాడడం దౌర్భాగ్యం

ఇరగవరం, ఏప్రిల్ 11 : పేదలకు మంచి చేయాలని జగన్ ప్రోత్సహిస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబు కిరాణా, కిళ్లీ కొట్లలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయంటూ చిరు వ్యాపారులపై పగ పట్టినట్లుగా మాట్లాడడం దౌర్భాగ్యమని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో గురువారం నిర్వహించిన కిళ్లీ, బీడీ, సిగరెట్, సోడా అండ్ కూల్ డ్రింక్స్ వర్తక సంక్షేమ సంఘ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు.